## చిన్నకథ

# లాంతరేసి వెతికినా..

సాయంత్రం ఐదింటికి కడప నుండి తిరుపతికి వెళ్ళే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎప్పటిలాగానే ఆ రోజు కూడా రద్దీగా వుంది. ట్రైన్ కదుల్తూ వుండగా అందులోకి ఎక్కాడు దిలీప్. సీట్లు కూడా ఖాళీ లేవు. పైగా ఇంజన్ పక్కనే వున్న బోగీ అది.

ఓ సీట్లో నలుగురు తమ బ్యాగులను కూడా సీట్లోనే పక్కన పెట్టుకుని కూర్చుని ఉన్నారు.

''కొద్దిగా సర్దుకుని కూర్చోండి. తిరుపతి వరకూ వెళ్లాలి.'' అభ్యర్థనగా అన్నాడు దిలీప్.

''లేదు. ఇంకొకరు వస్తారు'' కటువుగా చెప్పి ముఖం తిప్పుకున్నాడో పెద్దమనిషి.

ట్రైను నందలూరు స్టేషన్ దాటినా ఎవ్వరూ రాలేదు.

ఏమిటో, మనుషుల్లో బొత్తిగా మానవత్వం కరువై పోతోంది అనుకున్నాడు దిలీప్. బస్సుల్లో కూడా అంతేకదా. లేడీస్ సీట్లను కూడా దర్జాగా మగాళ్లు ఆక్రమిస్తారు. ఆడవాళ్లు బిడ్డను చంకలో పెట్టుకొని నిలబడి వున్నా పట్టించుకోరు. రాను రాను మనుషుల్లో స్వార్థం పెరిగిపోతోంది. అనుకున్నాడు దిలీప్.

ఓ స్నేహితుడి వివాహానికి కడప వచ్చి మళ్లీ తిరుపతికి వెళ్తున్నాడు దిలీప్. మధ్యాహ్నం పెళ్లిలో తాను చూసిన దృశ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

భోజనాల టైంలో అందరూ భోంచేస్తూ వుండగా ఎంట్రన్సు దగ్గర గుమిగూడారు కొందరు వీధి బాలలు. ఆహూతులకు వద్దన్నా వడ్డిస్తున్న నిర్వాహకులు ఆ అనాథ బాలలను తరిమి కొడ్తున్నారు. పెళ్లిలో చాలా పదార్థాలు మిగిలిపోయాయి. వాటిని సైతం ఆ పిల్లల కివ్వకుండా చెత్తకుండీలో వేయడంతో ఆ పిల్లలు పోలోమని అక్కడికి ఎగబడ్డారు. ఆ దృశ్యాన్ని చూసిన దిలీప్ మనసు కలచివేసినట్లైంది.



'నాలుగైదేళ్ల పిల్లలు పొట్టకూటికోసం దొమ్మరాటలు వీధుల్లో ఆడటం, మండుటెండలో కొందరు ఆడవాళ్లు పసిబిడ్డల్ని చంకల్లో వేసుకొని అడుక్కోవడం' ఇవన్నీ చూడ్డానికి అలవాటు పడిపోయారు జనం. 'రాను రాను మనుషుల గుండెలు పాషాణాలై పోతున్నాయి' అనుకున్నాడు దిలీప్.

'సోక్రటీసు అనుకుంటాను. రాత్రివేళల్లో ఓ లాంతరు తీసుకుని వీధుల్లోకి వెళ్లేవాడట. ఎవరైనా అడిగితే మానవత్వమున్న మనిషికోసం వెతుకుతున్నాను అనేవాడట. అప్పటికీ ఇప్పటికీ ఆ పరిస్థితిలో ఏ మాత్రం మార్పులేదు' అనిపించింది దిలీప్‌కు.

ట్రైను రాజంపేట స్టేషన్లో ఆగినప్పుడు సీటు దొరికింది దిలీప్‌కు. కిటికీలోంచి వస్తున్న చల్లటి గాలికి మాగన్నుగా నిద్ర పట్టిందతనికి.

రేణిగుంట స్టేషన్లో రైలు ఆగింది. అప్పుడే దిలీప్‌కు మెలకువ వచ్చింది. వాచీలో టైం చూసుకుని 'ట్రైను కరెక్ట్ టైమ్‌కే తిరుపతి చేరుతుంది' అనుకున్నాడు.

పదినిమిషాల తరువాత రైలు కూతవేసింది కాని ఎందుకో బయల్దేరలేదు. తమ బోగీలోనే ముందువైపు సీట్లో ఏదో కలకలం వినిపించింది. ఏం జరగుతూ వుందో చూద్దామని అటు వెళ్లాడు.

'బుద్ధి లేదటయ్యా, ఇన్నేళ్లు వచ్చాయి. ఇలాంటి అఘాయిత్యం చేస్తే నీ భార్యా పిల్లలేమై పోవాలి?' కన్నీళ్లతో వున్న ఓ పంచెకట్టు వ్యక్తిని చీవాట్లు పెడ్తున్నాడో పెద్దమనిషి. పక్కనే వున్న వాళ్లను మాటల్లో పెట్టి విషయం తెలుసుకున్నాడు దిలీప్.

రైలు కదలబోతుండగా ఆ పంచెకట్టు వ్యక్తి పట్టాలపై పడుకొని ఆత్మహత్యాప్రయత్నం చేశాడట. ఇంతలో యుగంధర్ అనే పెద్దాయన పట్టాలపైకి దూకి ఆయన్ను రక్షించాడట.

'అబ్బ, ఇన్నాళ్లకు మంచితనం, మానవత్వం, తెగింపు మూర్తీభవించిన మనిషిని చూశాను. ప్రాణాలకు తెగించి సాటి మనిషిని రక్షించాడు' అని ఆనందంతో అనుకున్నాడు దిలీప్.

రైలు తిరుపతి చేరిన తరువాత యుగంధర్ వెనకే దిగాడు దిలీప్.

'కంగ్రాచ్యులేషన్స్ సార్. ఓ మనిషి ప్రాణాలు కాపాడారు' అని యుగంధర్ చేయిపట్టుకొని అభినందించాడు దిలీప్.

ఓ క్షణం యుగంధర్ తత్తరపడినట్లు కనిపించాడు. అంతలో దిలీప్ చెప్తున్నది గ్రహించి 'ఓ రేణిగుంటలో జరిగినదాని గురించా. నేనర్జంటుగా తిరుపతికి వెళ్లాలి. ఇలాంటి ఆత్మహత్య జరిగితే ట్రైను లేటవుతుంది. అందుకే డ్రైవరును హెచ్చరించి పట్టాలపై నుంచి ఆయన్ను రక్షించాను. తిరుపతికి వెళ్లిన తర్వాత కావాలంటే ఎట్లైనా చావమన్నాను' అన్నాడతను.

దిలీప్‌కు దిమ్మ తిరిగినట్లుంది. తిరిగి చూడకుండా స్టేషన్లోనుంచి వెలుపలకు నడిచాడు.

**- రావపూటి రమేష్**